JESUS
316

# యేసు ఎవరు?

**యేసు ఎవరు?** ఆ ప్రశ్నకు బైబిల్ ఒకే ఒక నిజమైన జవాబును అందిస్తుంది. అపొస్తలుడైన పౌలు ఇలా రాసాడు, *"దైవావేశమువలన [ఊదబడి] కలిగిన ప్రతిలేఖనము"* (2 తిమోతి 3:16). దేవుని చేత ఊదబడిన బైబిల్, ఆదికాండము నుండి ప్రకటన గ్రంథం వరకు, గడచిన నిత్యత్వం నుండి రానున్న నిత్యత్వం వరకు యేసు దేవుడని బోధిస్తుంది. ఆయన *"అల్ఫాయు ఓమెగయు"* అని బైబిల్ ప్రకటిస్తుంది (ప్రకటన 1:8). బైబిల్ యేసును దేవునిగా, సృష్టికర్తగా, గొప్ప కాపరిగా, ప్రభువుగా, విమోచనకర్తగా, దేవుని గొర్రెపిల్లగా, ప్రభువుల ప్రభువుగా, రాజుల రాజుగా, ఇమ్మానుయేలు (దేవుడు మనకు తోడు)గా, రక్షకునిగా, ప్రధాన యాజకునిగా, మరియు పునరుత్థానము మరియు జీవముగాను గుర్తిస్తుంది.

**యేసు సృష్టికర్త.** *"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి,"* యోహాను 1:1-14 నుండి సంగ్రహించబడింది. *"ఆకాశమందున్నవియు భూమియందున్న వియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను», సర్వమును ఆయనయందు సృజింప బడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను,"* కొలస్సీ 1:16-17 నుండి సంగ్రహించబడింది.

**"నేనే" అనువాడు యేసే.** నిర్గమకాండము 3లో (~ క్రీ.పూ. 1,450) ప్రభువు దూతయైన యేసు మండుచున్న పొదలోనుండి మోషేని పిలిచి, తనను తాను మహోన్నతుడైన *"నేనే"* అని పరిచయం చేసుకున్నాడు. యోహాను 8లో, యేసు తనను తాను అబ్రాహాము (~క్రీ. పూ. 2,100) మరియు యూదులకు పూర్వమే ఉన్న మహోన్నతుడైన "నేనే" అని ప్రకటించుకున్నాడు. దాని ద్వారా యేసు తాను దేవుడనని చెప్పుకుంటున్నాడని గ్రహించి, ఆయనను చంపడానికి రాళ్లు పట్టుకున్నారు. తరువాత, యేసు, "నేనును తండ్రియును ఏకమై యున్నామని" చెప్పాడు (యోహాను 10:30-31). అప్పుడు కూడా యూదులు రాళ్లు పట్టుకున్నారు.

**పాతనిబంధనలో యేసు ఉన్నాడు.** తండ్రియైన దేవుని ఎవ్వరూ ఎప్పుడూ చూడలేదు (యోహాను 1:18, 6:46). కానీ, దేవుడు బేత్లెహేములో మానవునిగా పుట్టక మునుపు పాతనిబంధనలో అనేకమందికి ప్రత్యక్షమయ్యాడు. ఆదికాండము 16 & 21లో ఆయన ప్రభువు దూతగా హాగరుకు, నిర్గమకాండము 3లో మోషేకు, న్యాయాధిపతులు 6లో గిద్యోనుకు, మరియు న్యాయాధిపతులు 13లో సంసోను తల్లిదండ్రులకు ప్రభువు దూతగా ప్రత్యక్షమయ్యాడు. ఆదికాండము 18 & 22 అబ్రాహాముకు మరియు ఆదికాండము 31 & 32లో యాకోబుకు కూడా ప్రత్యక్షమయ్యాడు. మరియు యెషయా 48:12-19లో (దాదాపు క్రీ.పూ. 700 సంవత్సరాలలో వ్రాయబడింది) త్రిత్వములో యేసు గురించి ప్రస్తావించబడింది.

**ముందుగా చెప్పబడినవాడు యేసే.** వందల సంవత్సరాలకు పూర్వము నుండి యేసు జననం, జీవితం మరియు మరణం గురించి 300లకు పైగా పాతనిబంధన ప్రవచనాలు వివరిస్తున్నాయి. కీర్తనలు 22లో (దాదాపు క్రీ.పూ. 1,000లో రాయబడ్డాయి. రాళ్ళతో కొట్టి చంపి మరణ శిక్ష విధించే రోజులు అవి.) ఉన్న కొన్ని ప్రవచనాలు ఆయన సిలువ మరణం గూర్చి భయంకరమైన రీతిలో వర్ణిస్తున్నాయి. కీర్తనలు 22లోని ప్రవచనాల నెరవేర్పు గురించి మత్తయి 27లో రాయబడింది.

**యేసు దైవ-మానవునిగా మారాడు.** *"మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను"* అని ప్రవక్తయైన యెషయా ప్రవచించాడు (యెషయా 9:6). ఆయన సర్వశక్తుడైన దేవుడని యెషయా గుర్తించాడు. నిత్యుడైన కుమారుడు బేత్లెహేములో జన్మించిన శిశువుగా అనుగ్రహించబడ్డాడు. యేసు జన్మించకముందే, భూతకాలము యొక్క నిత్యత్వములో ఉన్నవాడు. "దేవుని కుమారుడు" అనే పేరు ఆయన జననం కంటే ఆయన స్థాయిని వర్ణిస్తుంది. బేత్లెహేములో జన్మించిన తరువాత ఆయన ఉనికిలోనికి వచ్చాడని దాని అర్థం కాదు. *"క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూ పము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించు కొనెను"* అని అపొస్తలుడైన పౌలు రాసాడు (ఫిలిప్పీ 2:5-8). యేసు దేవునిగా ఉంటూనే పూర్తి మానవునిగా మారాడు. నిత్యుడై, ముందుగా ఉన్నవాడైన యేసు మానవునిగా మారడానికి పరలోకం నుండి దిగివచ్చాడు (యోహాను 3:13, 31, యోహాను 6:33-38). యేసు ఒకే సమయంలో దేవుడు మరియు మానవునిగా ఉన్నాడు.

**యేసు అద్భుతాలు చేసాడు.** ఆయన చేసిన అద్భుతాలు చాలా క్రొత్తనిబంధనలో రాయబడ్డాయి. వాటిలో మూడు ఆయన చేసిన వ్యాఖ్యలకు ఆశ్చర్యరీతిగా అనుసంధానమై ఉంటాయి. ఆయన అద్భుతరీతిగా 5,000 మందికి ఆహారమిచ్చిన తరువాత *"జీవాహారము నేనే"* అన్నాడు (యోహాను 6:35). ఆయన *"నేను ఈ లోకములో ఉన్నప్పుడు లోకమునకు వెలుగునని"* చెప్పి గ్రుడ్డివానిని స్వస్థపరిచాడు (యోహాను 11:25). మరియు ఆయన *"పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును"* అని చెప్పాడు (యోహాను 11:25). అప్పుడు యేసు నాలుగు రోజుల క్రితం మరణించిన తన స్నేహితుడైన లాజరు సమాధి వద్దకు వెళ్ళి అతడిని బ్రతికించాడు. యేసు రోగులను, కుంటివారిని, చెవిటివారిని, మూగవారిని, కుష్ఠురోగులను, మరియు దయ్యము పట్టినవారిని స్వస్థపరచాడు. ఆయన నీటిని ద్రాక్షరసముగా మార్చాడు, నీటిమీద నడిచాడు, మరియు సముద్రాన్ని నిమ్మళింపజేసాడు. మత్తయి 9:2-7లో యేసు వద్దకు తేబడిన పక్షవాతం కలిగిన ఒక వ్యక్తి గురించి రాయబడింది.

ఆయన అతడితో *“ధైర్యముగా ఉండుము, నీ పాపములు క్షమింపబడియున్నవని”* చెప్పాడు. దేవుడు మాత్రమే పాపములు క్షమించగలడు కనుక మత పెద్దలు ఆయన దేవదూషణ చేస్తున్నాడని అనుకున్నారు. *“నీ పాపములు క్షమింపబడియున్నవని చెప్పుట సులభమా, లేచి నడువుమని చెప్పుట సులభమా? అయినను పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను అని చెప్పి, ఆయన పక్షవాయువుగలవాని చూచి–నీవు లేచి నీ మంచమెత్తికొని నీ యింటికి పొమ్మని చెప్పగా వాడు లేచి తన యింటికి వెళ్లెను.”*

**యేసు తాను దేవుడని నిరూపించుకున్నాడు.** యేసు ఆయన జననం, జీవితం, మరియు మరణం విషయంలో చెప్పబడిన పాతనిబంధన ప్రవచనాలు నెరవేర్చాడు. ఆయన దేవుడని చూపించడానికి అనేక అద్భుతాలు చేశాడు. ఆయన అధికారంతో బోధించాడు. *“యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను”* (మత్తయి 7:28-29). మరియు ఆయన పాపరహిత జీవితాన్ని జీవించాడు (హెబ్రీ 4:15, 1 పేతురు 2:22, 1 యోహాను 3:5). పాపరహిత దైవమనవునిగా యేసు పరిపూర్ణమైన దేవుని గొర్రెపిల్లగా మారి మన పాపముల కొరకు సిలువలో బలి అయ్యాడు. *“మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసి కొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి”* (1 పేతురు 2:24).

**యేసు సిలువవేయబడి మరణము నుండి లేచాడు.** *“వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిర”*ని 1 పేతురు 1:18-19లో చెప్పబడింది. *“ఆయనను వారు మ్రానున వ్రేలాడదీసి చంపిరి. దేవుడాయనను మూడవ దినమున లేపి ... ఆయన ప్రత్యక్షముగా కనబడునట్లు అనుగ్రహించెను. ఆయనయందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయననుగూర్చి సాక్ష్య మిచ్చుచున్నారనెను”* (అపొ 10:39-40, 43). *“నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవదినమున లేపబడెను”* (1 కొరింథీ 15:3-4). యేసు సమాధి నుండి లేచి తిరిగి పరలోకానికి ఆరోహణం కాక మునుపు అనేకమంది సాక్షులకు కనిపించాడు.

**యేసు ఒక్కడే దేవుని వద్దకు మార్గము.** *“యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు”* అని యేసు చెప్పాడు (యోహాను 14:6). అపొస్తలుడైన పేతురు, *“మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము”* అని చెప్పాడు (అపొ 4:12). అపొస్తలుడైన పౌలు, *“దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్య వర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను”* అని చెప్పాడు (1 తిమోతి 2:5-6). దేవుని వద్దకు చేరే యేసు మార్గం మిగిలిన మతాలన్నిటికీ భిన్నంగా ఉంటుంది. అవి మన పాప సమస్యకు ఎటువంటి పరిష్కారం ఇవ్వలేవు. వారు మంచి చెడులకు ఇచ్చే భిన్నమైన నిర్వచనాల ప్రకారం మీరు మంచి జరిగిస్తే, వారి దేవుడు మీ పాపాలను పట్టించుకోకుండా పరలోకానికి తీసుకెళ్తాడని వారు బోధిస్తారు. యేసు మార్గం ఏమిటంటే, మీరు ఆయనయందు విశ్వాసం ఉంచుట ద్వారా సిలువలో మీ పాప క్రయధనం చెల్లించబడి మీరు క్షమించబడతారు. యేసుతో ఉంటే మీరు క్షమించబడినవారిగా పరలోకానికి వెళతారు. *“దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను”* (యోహాను 3:16).

**యేసు తిరిగి రాబోతున్నాడు.** యేసు, *“నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరునుఉండు లాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసి కొని పోవుదును”* అని చెప్పాడు (యోహాను 14:2-3). మరియు బైబిల్లోని చివరి మాటల్లో, యేసు, *“అవును, త్వరగా వచ్చుచున్నానని”* చెప్పాడు. అపొస్తలుడైన యోహాను, *“ఆమేన్; ప్రభువైన యేసూ, రమ్ము”* అని చెప్పాడు (ప్రకటన 22:20-21). యేసు ఈరోజు తిరిగి వస్తే, ఆయనను కలుసుకొనడానికి నీవు సిద్ధంగా ఉన్నావా? ఆ నిశ్చయత పొందుకొనటానికి, యేసునందు విశ్వాసం ఉంచి దేవుని చేత క్షమించబడటానికి www.Gospel316.org సందర్శించండి.

**భూతకాలంలోని నిత్యత్వం నుండి భవిష్యత్ కాలంలోని నిత్యత్వం వరకు యేసే దేవుడు.**

**ఆయన పేరు వినబడగానే అద్భుతరీతిలో ఆశ్చర్యానికి గురికండి!**

---

*యేసు ఎవరు?* © 2025 by John D. Morris III అనేది Acts One Eight వారిచేత ప్రచురించబడింది. ఈ పూర్తి స్టేట్మెంట్ తో కలిపి, సమాచారంలో ఎటువంటి మార్పులు చేయకుండా మీరు దీనిని ఉచితంగా ముద్రించుకోవచ్చు, కాపీ చేయవచ్చు, పోస్టు, ఈ-మెయిల్ లేదా మెసేజ్ చేయవచ్చు. మీ పరిచర్య లేదా సంఘం పేరు లేదా లోగోను మొదటి పేజీ పైభాగంలో మరియు సంప్రదించడానికి కావలసిన వివరాలను రెండవ పేజీ క్రింద ప్రక్కన మందపాటి లైనుకు పైన ముద్రించవచ్చు. Jesus316 బైబిల్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు యేసు క్రీస్తునందు విశ్వాసం ఉంచి ఆయన శిష్యులుగా అభివృద్ధి చెందటానికి సహాయం చేసేందుకు ఇది నడిపించబడుచున్నది. మీరు (వీలైతే ఇంగ్లీషు భాషలో) మాకు ఈ-మెయిల్ చేయగలిగిన చిరునామా: Hello@Mail316.org. ఆంగ్లేయేతర వర్షన్లకు అనువాద సహకారం అందించినవారు www.ChristianLingua.com. *యేసు ఎవరు?* www.Jesus316.orgలో 48 భాషల్లో ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఆంగ్ల వర్షన్లో ఉన్న బైబిల్ ఉద్ధాటనలు The Lockman Foundation's New American Standard Bible 1995 నుండి సేకరించబడినవి. ఈ అనువాదం కొరకు బైబిలో ఉద్ధాటనలు బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి తెలుగు ఓల్డ్ వర్షన్ నుండి సేకరించబడినవి.